క్లుప్తంగా

జీజీహెచ్ నోటిఫికేషన్ రద్దు చేయాలి

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో జూనియర్ అసిస్టెంట్ పోస్టును భర్తీ చేసేందుకు విడుదల చేసిన నోటిఫికేషన్‌ను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వడ్డే బాలయ్య కోరారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్‌ను కలసి లిఖిత పూర్వకంగా మంగళవారం ఫిర్యాదు చేశారు. గతంలో నోటిఫికేషన్ ఇచ్చినప్పుడు జూనియర్ అసిస్టెంట్ పోస్టుకు ఇంటర్ అర్హతగా పేర్కొన్నారని, తాజాగా ఇచ్చిన నోటిఫికేషన్‌లో డిగ్రీ అర్హతగా ఇచ్చారన్నారు. ప్రస్తుతం ఆస్పత్రిలో ఉద్యోగం చేస్తున్న వారికి నిబంధనల ప్రకారం ఇంటర్ అర్హత సరిపోతుందని, ఈ నేపథ్యంలో నోటిఫికేషన్ రద్దు చేసి నూతన నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఏఐటీయూసీ జిల్లా గౌరవ అధ్యక్షుడు కోటా మాల్యాద్రి, నగర కార్యదర్శి విజయ్‌బాబు, జీజీహెచ్ బ్రాంచి ఉపాధ్యక్షుడు వి.నాగరాజు, పి.ఏడుకొండలు, బ్రాంచి సహాయ కార్యదర్శి అబ్రహం పాల్గొన్నారు.

ఉపాధి హామీ బకాయిలు చెల్లించాలి

లక్ష్మీపురం: ఉపాధి హామీ కూలీలకు రావలసిన బకాయిలు తక్షణమే చెల్లించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాబోతు ఈశ్వరరావు అన్నారు. స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ తేజను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రూ.95 కోట్లు తక్షణమే విడుదల చేయాలని, అదేవిధంగా ఉపాధి హామీ కూలీలకు ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీలో పని చేసే క్షేత్రస్థాయి సిబ్బందిపై అధికార పార్టీ నేతలు రాజకీయ వేధింపులు ఆపాలన్నారు. 100 రోజులుపని పూర్తి అయిన ఉపాధి కూలీలకు పనిముట్లు ఇవ్వాలన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు తన్నీరు ప్రభుదాసు, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రంకొండ సత్యానందం, రెంటాల కుమారి, మేరిగ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: ఓ విద్యార్థి ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్‌లో పెట్టుబడి పెట్టి మోసపోయిన ఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. ఏటీ అగ్రహారం 3వలైనుకు చెందిన పవన్ బీటెక్ 4వ సంవత్సరం చదువుతున్నాడు. ఆన్‌లైన్ ట్రేడింగ్ యాప్‌లో తొలుత చిన్న మొత్తంలో పెట్టుబడి పెట్టాడు. యాప్ నిర్వాహకులు సకాలంలో అతడికి లాభాలు రుచి చూపించారు. దీంతో పవన్ వరసగా ఎక్కువ మొత్తం పెట్టుబడి పెడుతూ వచ్చాడు. చివరకు యాప్ నిర్వాహకులు అసలు, లాభం రెండూ చెల్లించలేదు. మొత్తం రూ.2.35 లక్షలు మోసపోయినట్లు పవన్ మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


రాజవిద్య, రాజగుహ్యయోగంపై ఆధ్యాత్మిక ప్రవచనం



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళావేదికపై మంగళవారం రాత్రి శ్రీమద్భగవద్గీతలోని 9వ అధ్యాయం – రాజవిద్యా రాజగుహ్యయోగంపై ఆధ్యాత్మిక ప్రవచనం నిర్వహించారు. బండ్లమూడి విజయలక్ష్మి సౌజన్యంతో జరగ్గా, ఆలయ కమిటీ అధ్యక్షులు సిహెచ్.మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈ సందర్భంగా చిన్మయ మిషన్ బ్రహ్మచారి సువీరానందస్వామి మాట్లాడుతూ శ్రీకృష్ణ పరమాత్మ అర్జునితో ఈ ప్రకృతి చరాచర జగత్తును సృష్టిస్తున్నానని అన్నారు.

యోగా శిక్షణకు మంచి ఆదరణ

వీసీ ఆచార్య కె.గంగాధరరావు



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ వ్యాయామ విద్యా కళాశాల యోగ విభాగ అధ్యాపకులు డాక్టర్ కాశీభట్ల సత్యమూర్తి రచించిన 'యోగా ఇన్‌స్ట్రక్షన్' పుస్తకాన్ని మంగళవారం వీసీ ఆచార్య కె.గంగాధరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యోగ విద్యకు రోజురోజుకు ఆదరణ పెరుగుతున్న కారణంగా యోగ శిక్షణకు కూడా మంచి ఆదరణ లభిస్తోందన్నారు. అయితే ఇది కేవలం శారీరక వ్యాయామలా కాకుండా దేహం, మనస్సు సమన్వయాన్ని సాధించేలా విద్యార్థులు యోగ అభ్యసించాలని యోగా అధ్యాపకులు, నిపుణులు సూచిస్తుంటారన్నారు. యోగా ఇన్‌స్ట్రక్షన్ పుస్తకం అధ్యాపకులకు ఒక టీచింగ్ మాన్యువల్‌గా ఉపకరిస్తుందన్నారు. తరగతి గదిలో బోధన తోపాటు ప్రాక్టికల్స్ విషయంలో తీసుకోవాల్సిన పలు సాంకేతికమైన జాగ్రత్తలు ఇందులో పొందుపరచడం అభినందనీయమని చెప్పారు. రెక్టార్ ఆచార్య కె.రత్నషీలా మణి, రిజిస్ట్రార్ ఆచార్య జి.సింహాచలం, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, యోగ కోర్సు కోఆర్డినేటర్ డాక్టర్ డి.సూర్యనారాయణ, అధ్యాపకులు ఎ.రాధిక, సీఎస్ఆర్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రమణ పాల్గొన్నారు.

సమస్యలతో కునారిల్లుతోన్న సంక్షేమ హాస్టళ్లు

- వసతి గృహాల్లో సమస్యలు సత్వరం పరిష్కరించాలి
- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వి.జాన్సన్ బాబు
- ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఏఐఎస్ఎఫ్ నాయకులు

లక్ష్మీపురం: రాష్ట్రవ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లోని విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట మంగళవారం అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు పాల్గొని మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా సాంఘిక సంక్షేమ వసతి గృహాలకు సొంత భవనాలు లేక అద్దె భవనాల్లో విద్యార్థులు చాలీచాలని వసతులతో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అనేక మార్లు జిల్లా సాంఘిక సంక్షేమ అధికారుల దృష్టికి సమస్యలను తీసుకువెళ్లినా కనీసం ఆ భవనాల వైపు కన్నెత్తి కూడా చూడలేదని మండిపడ్డారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం సొంత భవనాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. హాస్టల్స్ మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాలన్నారు. ప్రభుత్వ ఇంటర్మీడియెట్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. నెల రోజుల్లో సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించకపోతే చలో సచివాలయానికి పిలుపునిస్తామని హెచ్చరించారు. జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి పాశం వెంకటేష్, బందెల నాసర్ జీ మాట్లాడుతూ గత 15 రోజులుగా జిల్లా వ్యాప్తంగా ఉన్న సాంఘిక సంక్షేమ వసతి గృహాలను సందర్శించామని ప్రస్తుత గృహాల్లో అనేక సమస్యలను గుర్తించామని అన్నారు. జిల్లాలో ఉన్న వసతి గృహాల సమస్యలపై గతంలో అనేకసార్లు జిల్లా కలెక్టర్‌ను, సాంఘిక సంక్షేమ శాఖ అధికారులని కలిసినా ఎటువంటి స్పందన లేదని వాపోయారు. గుంటూరు జిల్లా విద్యాకేంద్రంగా పేరు ఉందని ఇక్కడికి అనేక ప్రాంతాల నుంచి పేద వర్గాల విద్యార్థులు ప్రభుత్వ హాస్టల్లో ఉండి చదువుకుందామని వస్తే, హాస్టళ్ల అధ్వానంగా దర్శనమిస్తున్నాయని తెలిపారు. నగరంలోని కోడిగుడ్ల సత్రం నందు సమీకృత సంక్షేమ హాస్టల్ భవనానికి రూ.కోటి కేటాయించి తక్షణమే పూర్తి చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. నగరంలో ఉన్న కొన్ని హాస్టళ్లలో పూర్తిస్థాయిలో బాత్రూమ్స్ లేవని, 120 మంది విద్యార్థులు కేవలం నాలుగు బాత్రూంలు మాత్రమే ఉన్నాయన్నారు. ధర్నా అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ తేజకు నాయకులు మెమోరాండం అందజేశారు. అన్ని సమస్యలనే ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని నాయకులు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్స్ యశ్వంత్, శివ నాగరాజు, అఖి, నవ్య శ్రీ, కిరణ్, డేవిడ్, అమర్నాథ్, అజయ్, వెంకటేష్, బన్నీ, గణేష్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న జేకేసీ కళాశాల ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు

గుంటూరు ఎడ్యుకేషన్: విద్యార్థులు చదువుతో పాటు వ్యక్తిత్వాన్ని అభివృద్ధి పరచుకోవాలని జేకేసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.నాగేశ్వరరావు పేర్కొన్నారు. యువజన సర్వీసులశాఖ స్టెప్–స్వశక్తి ఆధ్వర్యంలో మంగళవారం జేకేసీ కళాశాలలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, కెరీర్ మార్గదర్శకాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు మాట్లాడుతూ పట్టభద్రులుగా సమాజంలోకి అడుగుపెట్టే విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని సూచించారు. కెరీర్ కౌన్సెలింగ్ శిక్షకుడు ఎస్.అయ్యప్ప మాట్లాడుతూ వ్యక్తిత్వ వికాసం, నాయకత్వ లక్షణాలను గురించి వివరిస్తూ, విద్యార్థులు వారిలోని సృజనాత్మక శక్తిని మేల్కొలిపి భవిష్యత్తును తీర్చిదిద్దుకోవాలని సూచించారు. జీవితంలో ఉన్నతంగా ఎదిగేందుకు కృషి, పట్టుదలతో ఉండాలన్నారు. యువజన సర్వీసుల శాఖ సూపరింటెండెంట్ సీహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థుల వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దేందుకు యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.గోపీచంద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డాక్టర్ డి.రాహుల్, కె.చరణ్ చౌదరి, ఎల్.అజయ్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

పెన్షనర్ల సమస్యలను సత్వరం పరిష్కరించాలి



లక్ష్మీపురం: కేంద్ర ప్రభుత్వం పోస్టల్ పెన్షనర్ల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను తక్షణే పరిష్కరించాలని ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక నగరంపాలెంలోని పోస్టల్ కార్యాలయం వద్ద మంగళవారం ఆల్ ఇండియా పోస్టల్, ఆర్ఎంఎస్ పెన్షనర్స్ అసోసియేషన్, ఆంధ్రప్రదేశ్ సర్కిల్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తమ 15 డిమాండ్లకు వెంటనే ఆమోదం తెలపాని డిమాండ్ చేశారు. ఈ విషయంపై అన్ని శాఖల అసోసియేషన్లు సమష్టి కృషితో పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ ఐక్యతే అపరిష్కృత సమస్యల పరిష్కారానికి మార్గమన్నారు. విశ్రాంత ఉద్యోగులపై ప్రభుత్వం చిన్న చూపు చూడటం మంచిది కాదన్నారు. ధర్నా లో పోస్టల్ గుంటూరు డివిజన్ కార్యదర్శులు వి.మోహన్‌రావు, బి.రామారావు, తెనాలి కార్యదర్శి ఎల్.ప్రసాదరావు, రాష్ట్ర కోశాధికారి సి.హెచ్.హనుమంతరావుపాల్గొన్నారు.

వయనాడ్ వరద బాధితులకు బియ్యం, వస్తు సామగ్రి

సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్‌కు అందజేసిన కృష్ణనగర్ పార్కు కమిటీ



బియ్యం బస్తాలను జంగాల అజయ్‌కుమార్‌కు అందజేస్తున్న కృష్ణనగర్ పార్కు కమిటీ సభ్యులు

లక్ష్మీపురం: ప్రకృతి విపత్తి వల్ల నష్టపోయిన కేరళలోని వయనాడ్ ప్రాంతం ప్రజలకు భారత కమ్యూనిస్టు పార్టీ సీపీఐ అండగా ఉంటుందని జిల్లా సీపీఐ కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక గుంటూరు కృష్ణనగర్ చంద్రా రాజేశ్వరరావు పార్కు కమిటీ వారు మంగళవారం కేరళ వయనాడ్ బాధితులకు బియ్యం, వస్తువులను సేకరించి సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ వరదల కారణంగా వయనాడ్ జిల్లా ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని సుమారు 400 మంది చనిపోవడం జరిగిందన్నారు. ఈ ప్రకృతి విపత్తు దేశంలో ప్రజలందరినీ కలచివేసిందని ఆ ప్రాంత ప్రజలకు సీపీఐ ఆధ్వర్యంలో సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి మాట్లాడుతూ గుంటూరు కృష్ణనగర్ పార్కు కమిటీ ఆధ్వర్యంలో బియ్యం, దుస్తులు ఇవ్వడం అభినందనీయం అన్నారు. సీపీఐ నగర కార్యవర్గ సభ్యులు రావుల అంజిబాబు, ఆకీటి అరుణ్ కుమార్, పార్కు కమిటీ కన్వీనర్ రామచంద్రుడు, కమిటీ సభ్యులు షేక్ బాబు, కట్టా వెంకటేశ్వర్లు, గుర్రం శ్రీనివాసరావు, కొండలు, రమాదేవి, సత్యనారాయణ, శ్యామ్ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ భరత్‌పై కేసు నమోదు

గుంటూరు ఈస్ట్: టీటీడీ తోమాల సేవ టికెట్ ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేసిన ఘటనపై ఎమ్మెల్సీ భరత్, ఆయన పీఆర్వో మల్లికార్జునరావుపై గుంటూరులోని అరండల్‌పేట పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలు.. పి.శివరామకృష్ణ ఏప్రిల్‌లో ఎమ్మెల్సీ భరత్, ఆయన పీఆర్వో మల్లికార్జునరావులను కలిశాడు. తోమాల సేవ టికెట్ అడిగాడు. శివరామకృష్ణ వద్ద నుంచి మొత్తం 24 మందికి గాను రూ.2.21 లక్షలు తీసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. పైగా ఆరుగురికి బ్రేక్ దర్శనం టికెట్ ఇచ్చాడు. టికెట్లపై వేరే వాళ్ల ఫొటోలు ఉన్నాయి. ఈ మొత్తం ఘటనపై శివరామకృష్ణ టీడీపీ నాయకులతో కలసి మంగళవారం అరండల్‌పేట ఎస్‌హెచ్‌ఓ శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సహజ కాన్పులు పెంచేందుకు కృషి చేయాలి



శిక్షణ పొందిన వారితో డాక్టర్ కిరణ్‌కుమార్

గుంటూరు మెడికల్: సహజ కాన్పుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్ అన్నారు. జీజీహెచ్‌లోని ప్రసూతి వార్డులోని సమావేశ మందిరంలో సహజ కాన్పుల్లో శిక్షణ పొందిన మిడ్ వైఫరీ, ఎడ్యుకేటర్స్ మిడ్ వైఫరీ డైరెక్టర్ సారాతో కలసి మంగళవారం ఆయన సమీక్ష చేశారు. డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ సిజేరియన్ డెలివరీల సంఖ్య పెరగకుండా జాగ్రత్తలు పాటించాలని కోరారు. పురిటినొప్పులు భరించలేక కొంతమంది ఇబ్బందులు పడుతున్న వారిని దృష్టిలో పెట్టుకుని సహజ కాన్పులు అయ్యే విధంగా కృషి చేయాలన్నారు. సాధారణ కాన్పులు చేసే విధంగా శిక్షణ పొందినవారు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మిడ్ విఫరీ ప్రతినిధి భీమారాయ్, గైనకాలజీ విభాగాధిపతి డాక్టర్ అరుణ, మిడ్ వైఫరీ ఎడ్యుకేటర్స్ పి.బేబీ, పి.అపర్ణ, జి.ప్రశాంతి పాల్గొన్నారు.

పురుగుమందు తాగి వ్యక్తి ఆత్మహత్య

గుంటూరురూరల్: కుటుంబ సమస్యల కారణంగా వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నల్లపాడు పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. నల్లపాడు కాలువ సెంటర్‌కు చెందిన తాళ్లూరి శ్రీనివాసరావు (50) ఇటీవల బంధువుల ఇంట్లో జరిగే శుభకార్యం నిమిత్తం నరసరావుపేట వెళ్లారు. అనంతరం తిరిగి ఇంటికి వచ్చిన తరువాత వారం రోజులుగా భార్యాభర్తలు గొడవలు పడుతున్నారు. ఈ క్రమంలో శ్రీనివాసరావు మనస్థాపానికి గురై సోమవారం రాత్రి పురుగుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. సంఘటనపై కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ప్రతి నెల సీపీఎస్ సబ్ స్క్రిప్షన్ ఉద్యోగి అకౌంట్‌లో జమ చేయాలి


ఏపీసీపీఎస్ఈఏ జిల్లా అధ్యక్షుడు గోపికృష్ణ



ఏపీసీపీఎస్ఈఏ నూతన కార్యవర్గం

గుంటూరు మెడికల్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం గుంటూరు జిల్లా కార్యాలయంలో ఏపీసీపీఎస్ఈఏ జిల్లా కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు గోపికృష్ణ మాట్లాడుతూ ప్రతి నెలా జీతం నుంచి రికవరీ చేసిన మొత్తం పీఆర్ఏఎన్ అకౌంట్‌లో జమ చేయాలని సీపీఎస్ రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరణ చేసే విధంగా ప్రభుత్వం ఆలోచించాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా గోపికృష్ణ, ప్రధాన కార్యదర్శిగా నాగరాజు, జిల్లా కోశాధికారిగా పవన్ కుమార్, గౌరవ సలహాదారుగా డాక్టర్ సుబ్బారావు, గౌరవ అధ్యక్షుడిగా చావా శ్రీనివాస్, సంయుక్త అధ్యక్షుడిగా నాగమణి, అదనపు ప్రధాన కార్యదర్శిగా సురేష్, జిల్లా ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసరావు, వివేక్, సాయిరాం, కృష్ణమూర్తి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా పోలిరెడ్డి, సిద్ధూ, మధుసూదన్ రావు, జిల్లా కార్యదర్శులుగా బాల వినీత్, వెంకట్, కోటా సాహెబ్, రఘురామిరెడ్డి, మహిళా విభాగం అధ్యక్షురాడిగా మాధవి, ప్రధాన కార్యదర్శిగా నాగమల్లేశ్వరి, అధికార ప్రతినిధిగా రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారని ఎన్నికల అధికారిగా షేక్ అబ్దుల్ రజాక్ వెల్లడించారు.

ఉపాధ్యాయుల సర్దుబాటుకు ఎస్టీయూ వ్యతిరేకం



మాట్లాడుతున్న ఏఐఎస్టీఎఫ్ జాతీయ ఆర్థిక కార్యదర్శి జోసఫ్ సుధీర్‌బాబు

గుంటూరు ఎడ్యుకేషన్: రాష్ట్రస్థాయిలో ఆన్‌లైన్ విధానంలో చేపడుతున్న ఉపాధ్యాయుల పని సర్దుబాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఆల్ ఇండియా సెకండరీ టీచర్స్ ఫెడరేషన్ (ఏఐఎస్టీఎఫ్) జాతీయ ఆర్థిక కార్యదర్శి సీహెచ్ జోసఫ్ సుధీర్‌బాబు స్పష్టం చేశారు. మంగళవారం కంకరగుంటలోని ఎస్టీయూ భవన్‌లో సంఘ జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు అధ్యక్షతన ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జోసఫ్ సుధీర్‌బాబు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సర్దుబాటు వ్యవహారాన్ని, ప్రత్యక్షంగా పాఠశాల విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం ద్వారా కేంద్రీకరించడాన్ని తక్షణమే విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు డి.పెదబాబు మాట్లాడుతూ 117 జీవోను అధికారంలోకి రాగానే రద్దు చేస్తామని హామీ ఇచ్చిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తక్షణమే హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. ఎస్టీయూ జిల్లా ప్రధాకార్యదర్శి డీకే సుబ్బారెడ్డి, ఎస్టీయూ రాష్ట్ర కౌన్సిలర్ షేక్ బాజీ, జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వై.శ్యాంబాబు, తుళ్లూరు, మేడికొండూరు మండలశాఖల అధ్యక్షులు పి.దిబ్బయ్య, జి.జోజప్ప, సీనియర్ నాయకుడు ఖాజావలి పాల్గొన్నారు.

బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలు దోహదం

డాక్టర్ షమ సుల్తానా



బాలింతలకు బహుమతులు అందజేస్తున్న డాక్టర్ షమ సుల్తానా

గుంటూరు మెడికల్: పుట్టిన బిడ్డకు తల్లి గంటలోపు పాలు ఇవ్వడం శ్రేయస్కరమని హోప్ విన్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ షమ సుల్తానా అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా జనని ప్రాజెక్టు సౌజన్యంతో.. మైనారిటీ హక్కుల పరిరక్షణ సమితి(ఎంహెచ్‌పీఎస్) ఆధ్వర్యంలో మంగళవారం గుంటూరులోని సమితి కార్యాలయంలో గర్భిణులకు, బాలింతలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోనే తల్లిపాలు ఇవ్వాలని, 6 నెలలు వయస్సు వరకు తల్లిపాలు తప్పనిసరిగా ఇవ్వాలన్నారు. తల్లిపాలు 2 సంవత్సరాల వయస్సు వరకు వీలైనంత ఎక్కువ కాలం ఇవ్వడం వల్ల తల్లులకు, బిడ్డకు ఎన్నో ప్రయోజనాలు కలుగుతాయన్నారు. తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించే కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా సమితి ఆధ్వర్యంలో చేస్తున్నామన్నారు. బిడ్డకు పాలు ఇవ్వడం వలన తల్లికి బ్రెస్ట్ క్యాన్సర్ రాకుండా ఉంటుందని వెల్లడించారు. కార్యక్రమంలో ఎంహెచ్ పీఎస్ ఉపాధ్యక్షురాలు ఫాతిమా, డాక్టర్ హరి ప్రియాంక, డాక్టర్ సారిక, హోప్ విన్ హాస్పిటల్స్ మేనేజర్ పి.నాగేశ్వరరావు, హాస్పిటల్ సిబ్బంది, జనని ప్రాజెక్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

భారతీయ జీవన విధానం ప్రపంచానికి మార్గదర్శకం

ఇస్కాన్ అధ్యాపకుడు వరాహ కృష్ణ ప్రభు గురూజీ



మాట్లాడుతున్న వరాహ కృష్ణ ప్రభు గురూజీ

గుంటూరు ఎడ్యుకేషన్: వేల సంవత్సరాలుగా భారతీయ జీవన విధానం సత్యం, ధర్మం, త్యాగశీలత ద్వారా ప్రపంచ దేశాలకు మార్గదర్శకంగా నిలిచిందని ఇస్కాన్ అధ్యాపకుడు వరాహ కృష్ణ ప్రభు గురూజీ పేర్కొన్నారు. మంగళవారం నగరంపాలెంలోని ప్రజ్ఞ విద్యా సంస్థల విద్యార్థులకు విలువలు–క్రమశిక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గురువు కృష్ణ ప్రభు గురూజీ మాట్లాడుతూ విద్యార్థులకు తరగతి చదువుల పాఠ్యాంశాలతో పాటు తల్లిదండ్రులను, గురువులను సమాజాన్ని ప్రేమించే బోధనలకు సైతం ప్రాధాన్యత నివ్వాలని చెప్పారు. మనిషి ఆలోచనలకు, పనులకు క్రియాశీలకంగా ఉండే మెదడును చురుకుగా ఉంచడంలో ధ్యానం ప్రాధాన్యతను తెలియ చెప్పాలని సూచించారు. ప్రజ్ఞ విద్యాసంస్థల కరస్పాండెంట్ నాయుడు చక్రనాగ్ మాట్లాడుతూ గత 25 ఏళ్లుగా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రజ్ఞను వెలికి తీసి వారిని ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మెడిటేషన్ చేయించారు. ఇస్కాన్ కమలాకాంత దాస్ గురూజీ, రామకృష్ణ గురూజీ, పాఠశాల డైరెక్టర్ నాయుడు కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

దేశం గర్వించదగ్గ ప్రజ్ఞాశాలి యామిని కృష్ణమూర్తి



సమావేశంలో మాట్లాడుతున్న వి.ఎస్.ఎన్.మల్లేశ్వరరావు, పక్కన సంస్థ సభ్యులు

లక్ష్మీపురం: భరతనాట్యం, కూచిపూడి, ఒడిస్సీ నత్య రీతులలో పాటు కర్ణాటక సంగీతం, వీణ వాదనలోనూ దేశం గర్వించదగ్గ ప్రజ్ఞాశాలి యామిని కృష్ణమూర్తి అని సంగీత విద్వాంసులు వి.ఎస్.ఎన్ మల్లేశ్వరరావు అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ప్రముఖ నాట్యకారిణి యామిని కృష్ణమూర్తి సంస్మరణ సభ జరిగింది. ముందుగా ఆమె చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు.

ఈ సందర్భంగా విఎస్ఎన్ మల్లేశ్వరరావు మాట్లాడుతూ తనకంటూ ఒక ప్రత్యేకమైన బాణిని,ఒరవడిని సృష్టించుకున్న యామిని కృష్ణమూర్తి తాను నేర్చుకున్న ప్రతి నృత్యబాణి సాంప్రదాయాన్ని గౌరవిస్తూ తన నాట్య వ్యక్తిత్వాన్ని ప్రదర్శించారన్నారు. గాయని ప్రసన్న లక్ష్మీ మాట్లాడుతూ కూచిపూడి నాట్యంలో యామిని ప్రతిభ అనన్య సామాన్యమన్నారు. రంగస్థల నటుడు ఎం ఘనశ్యామాచార్యులు, గాయకులు రాజశేఖర్, సాయిబాబా, వెంకాయమ్మ తదితరులు నివాళులర్పించారు.

విప్లవ ఉద్యమానికి ఊపిరి గద్దర్..

విప్లవ ఉద్యమానికి ఊపిరి గద్దర్ అరుదైన గాయకుడిగా, ప్రజా కవిగా విప్లవోద్యమానికి ఊపిరిలూదిన గొప్ప ప్రజా కళాకారుడు గద్దర్ అని అవగాహన సంస్థ కార్యదర్శి కొండాశివరామిరెడ్డి, రాజకీయ విశ్లేషకుడు జి.నాగేశ్వరరావు అన్నారు. స్థానిక అరండల్‌పేటలోని అవగాహన సంస్థ కార్యాలయంలో మంగళవారం విప్లవ గాయకుడు గద్దర్ ప్రథమ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళుర్పించారు. సీనియర్ ఇంజినీర్ ఎస్.సదాశివం మాట్లాడారు. అనంతరం సంస్థ సభ్యులు, సీనియర్ సిటిజన్స్ నివాళులర్పించారు.

షోకాజ్ నోటీసులు ఉపసంహరించుకోవాలి

మంత్రి డోలాకు గ్రామ సచివాలయ ఉద్యోగులు వినతి



మంత్రి డోలా వీరాంజనేయస్వామికి వినతిపత్రం అందజేస్తున్న సచివాలయ ఉద్యోగుల సంఘ నాయకులు

నెహ్రూనగర్: ఆగస్టు ఒకటో తేదీన పెన్షన్లు ఆలస్యంగా పంపిణీ చేశారన్న కారణంతో రాష్ట్ర వ్యాప్తంగా 4వేల మందికి పైగా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు ఇచ్చిన షోకాజ్ నోటీసులను ఉపసంహరించుకోవాలని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు షేక్ అబ్దుల్ రజాక్ మంత్రి డోలా వీరాంజనేయస్వామికి విన్నవించారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో మంత్రిని కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెన్షన్ పంపిణీ కోసం ప్రభుత్వం ఇచ్చే నగదు కోసం సచివాలయ ఉద్యోగులు జూలై 31వ తేదీన బ్యాంకుల వద్ద రాత్రి 9గంటల వరకు నిరీక్షించారని, ఆగస్టు ఒకటో తేదీన అనేక చోట్ల సర్వర్ సరిగా పనిచేయకపోవడం, సరిపడ డివైజ్‌లు ఉద్యోగులకు ఇవ్వనప్పటికీ ఆగస్టు 1,2వ తేదీల్లోనే 99శాతానికిపైగా పెన్షన్లను ఉద్యోగులు పంపిణీ చేశారన్నారు. ఇంత చేసిన కూడా గ్రామ సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు, సస్పెన్షన్లు చేయడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో సంఘ నాయకులు షణ్ముఖ్, మధు, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

స్కేటింగ్ విద్యార్థికి రోటరీ చేయూత



చెక్కు అందిస్తున్న రోటరీక్లబ్ గుంటూరు సెంటినియల్ సభ్యులు

నగరంపాలెం: స్కేటింగ్ క్రీడలో రాణిస్తూ, ఏటీఅగ్రహారం శ్రీవిజేత పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న విద్యార్థి షేక్ పీర్‌బాషాకు రూ.35 వేల చెక్కును రోటరీ క్లబ్ గుంటూరు సెంటినియల్ బృందం మంగళవారం స్కూల్‌లో అందజేశారు. ఈనెల 8–17 వరకు న్యూఢిల్లీలో నిర్వహించనున్న ఐసీసీ స్కేటింగ్ 19వ జాతీయ చాంపియన్ షిప్ పోటీలకు విద్యార్థి అర్హత సాధించగా, ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నట్లు గుర్తించారు. ఈ మేరకు సంస్థ అధ్యక్షుడు పొనగల్లు బాలసుబ్రహ్మణ్యం, కార్యదర్శి తొట్టెంపూడి నవీన్ చక్రవర్తి, సహాయ గవర్నర్ మలినేని పెరుమాళ్ల, క్లబ్ సభ్యులు చెక్కు అందజేశారు. గత ఆదివారం త్రోబాలు క్రీడాకారిణికి రూ.25 వేలు అందజేశామని కార్యదర్శి నవీన్‌చక్రవర్తి తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్షుడు మద్దినేని సుధాకర్, పెరవలి నాగవంశీ, మైనేని వీరయ్య, సుష్మ కొల్లా, మన్నవ రాజగోపాల్ పాల్గొన్నారు.

17న నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశం

నెహ్రూనగర్: నగరపాలక సంస్థ సాధారణ కౌన్సిల్ సమావేశం ఈ నెల 17వ తేదీ నిర్వహించనున్నట్లు డెప్యూటీ కమిషనర్ సీహెచ్ శ్రీనివాస్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సభ్యులు ప్రశ్నలు, ప్రతిపాదనలను పంపాలని ఈనెల 12వ తేదీలోగా అందించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

గుంటూరు రూరల్: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మంగళవారం నల్లపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. స్వర్ణభారతినగ్ 4వ లైనుకు చెందిన సిత్తరాల శ్రీనివాసరావు ప్రైవేట్ సంస్థలో కార్మికుడిగా పనిచేస్తుంటాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం పనిమీద ద్విచక్రవాహనంపై అడవితక్కెళ్లపాడు నుంచి తిరిగి వస్తుండగా దారి మధ్యలో కుక్క అడ్డువచ్చి సడన్ బ్రేక్ వేయటంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోయాడు. తలకు తీవ్రగాయాలు అవ్వటంతో స్థానికులు చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కి తరలించారు. ఆసుపత్రిలో పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగానే ఉందని తెలిపారు. సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.